సాక్షి నంద్యాల

శుక్రవారం, 25, అక్టోబర్, 2024



అలరించిన తోలుబొమ్మలాట

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల ఆలయ నిత్యకళావేదికపై పోరుమామిళ్లకు చెందిన వనపర్తి నరసింహారావు బృందం గురువారం ప్రదర్శించిన శ్రీరామ కథ తోలుబొమ్మలాట అలరించింది.



72 కి.మీ.. 75 స్పీడ్ బ్రేకర్లు

ఇది రాష్ట్ర రాజధాని అమరావతి రహదారి. నిత్యం వేల సంఖ్యలో వాహనాలు వెళ్తుంటాయి. ఈ దారిలో స్పీడ్ బ్రేకర్లతో వాహనదారులు బెంబేలెత్తుతున్నారు.

IIలో▸



టీబీ డ్యాం సమాచారం

పూర్తి మట్టం (అడుగులు)	:1,633
ప్రస్తుతం	:1,631.94
సామర్థ్యం (టీఎంసీలు)	:105.788
ప్రస్తుతం	:101.539
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	:97,751
అవుట్ ఫ్లో	:96,487

రండి బాబూ.. రండి!

- మద్యం షాప్‌లకు పోటీ వస్తున్న బార్లు
- ధరలు తగ్గించామంటూ బ్యానర్ల ఏర్పాటు
- క్వార్టర్ బాటిల్‌పై రూ.30, బీర్‌పై రూ.40 వరకు తగ్గింపు
- జిల్లాలో 22 బార్లు... నంద్యాలలోనే 15
- మరోవైపు పర్మిట్ రూమ్స్ లేకపోవడంతో రోడ్లపైనే తాగుతున్న మందుబాబులు
- ఇబ్బందులు పడుతున్న మహిళలు

జిల్లాలో ప్రైవేట్ వైన్ షాప్స్ యజమానులకు, బార్ అండ్ రెస్టారెంట్ల యజమానులకు మధ్య ధరల పోటీ ప్రారంభమైంది. మద్యం విక్రయాలు పెంచుకునేందుకు బార్ల యజమానులు భారీగా ధరలు తగ్గించేస్తున్నారు. తినే ఆహారంపైనా ప్రత్యేక డిస్కౌంట్లు ఇస్తున్నారు. బార్ ఓనర్లంతా కుమ్మక్కై మద్యం బాటిళ్ల రేట్లు తగ్గిస్తుండడంతో మందుబాబులు పండుగ చేసుకుంటున్నారు. – సాక్షి, నంద్యాల

జిల్లాలోని ఏడు ఎక్సైజ్ స్టేషన్ల పరిధిలో 22 బార్లున్నాయి. అందులో 15 బార్లు జిల్లా కేంద్రంలోనే నడుస్తున్నాయి. ప్రభుత్వ మద్యం దుకాణాల్లోని ధరలతో పోలిస్తే ఒక్కో క్వార్టర్ బాటిల్‌పై బార్లలో రూ.100 వరకు ఎక్కువగా విక్రయించేవారు. బీర్లు ఒక్కో చోట ఒక్కో రేట్‌తో విక్రయించేవారు. కనిష్టంగా రూ.100 ఎక్కువకు అమ్మేవారు. కూటమి ప్రభుత్వం నూతన మద్యం పాలసీ తీసుకురావడంతో ప్రభుత్వ మద్యం దుకాణాలన్నీ మూతపడ్డాయి. వాటి స్థానంలో జిల్లాలో 105 ప్రైవేట్ వైన్స్ షాపులు ఓపెనయ్యాయి.

ప్రైవేట్ వైన్స్ ఏర్పాటుతో ధర తగ్గింపు

ప్రైవేట్ వైన్స్ ఏర్పాటయ్యాక టైమింగ్‌ను కూడా ప్రభుత్వం పెంచింది. గతంలో ఉదయం 10 నుంచి రాత్రి 9 గంటల వరకు మద్యం దుకాణాలు తెరిచి ఉండేవి, ప్రభుత్వం ఆధీనంలో నడుస్తూ ఉండడంతో సమయ పాలన పక్కాగా పాటించేవారు. రాత్రి 9 గంటలకే మూసేసేవారు. దీంతో మందుబాబులు బార్లకు క్యూ కట్టేవారు. కొత్త ప్రైవేట్ షాప్స్ ఉదయం 10 నుంచి రాత్రి 10 గంటల వరకు తెరిచి ఉంచుతున్నారు. రాత్రి 10 గంటలు దాటిన తర్వాత కూడా షాప్‌లోనే ఉంటూ అక్రమ మార్గంలో విక్రయాలు సాగిస్తున్నారు. దీంతో అధిక ధర వెచ్చించి బార్లకు వెళ్లే బదులు ప్రైవేట్ వైన్స్‌లోనే మందుబాబులు కొనుగోలు చేస్తున్నారు.



మద్యం ధరలు తగ్గించామంటూ నంద్యాలలోని ఓ బార్ వద్ద ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ

మూడేళ్ల కాలపరిమితితో బార్ల లైసెన్స్‌లు

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం మూడేళ్ల కాలపరిమితితో బార్లకు లైసెన్స్‌లు జారీ చేసింది. ఈ లైసెన్స్‌లు 2025 వరకు కొనసాగనున్నాయి. ప్రైవేట్ వైన్స్ నుంచి పోటీ ఎక్కువగా ఉండడంతో బార్ అండ్ రెస్టారెంట్లు వెలవెలబోతున్నాయి. మందుబాబులంతా వైన్స్‌కే క్యూ కడుతున్నారు. ఈ ప్రభావంతో వారం రోజులుగా బార్ల ఆదాయం భారీగా తగ్గింది. వైన్స్ నుంచి పోటీని తట్టుకోవాలంటే రేట్లను భారీగా తగ్గించాలని నిర్ణయించుకున్నారు. బార్ యజమానులు కూడా సిండికేట్‌గా మారి ధరలను ఫిక్స్ చేసుకున్నారు. మొన్నటి వరకు కింగ్ ఫిషర్ బీర్ వైన్స్ షాపులో రూ.200 ఉంటే బార్లలో రూ.320 ఉండేది. ఇప్పుడు ప్రైవేట్ షాప్స్ నుంచి పోటీ తీవ్రంగా ఉండడంతో అదే బీర్‌ను రూ.40 నుంచి రూ.50 వరకు తగ్గించి విక్రయిస్తున్నారు. మందులోకి తీసుకునే ఆహారంపైనా డిస్కౌంట్లు ప్రకటిస్తున్నారు. ధరలు తగ్గించి విక్రయాలు పెంచుకోవాలని బార్ల యజమానులంతా సిండికేట్‌గా మారి ఒక్కసారిగా ధరలు తగ్గించడం గమనార్హం.

డిమాండ్ ఉన్న చోట ఎక్కువ.. లేకుంటే తక్కువ

జిల్లాలోని ఏడు ఎక్సైజ్ స్టేషన్ల పరిధిలో ఏర్పాటైన మద్యం దుకాణాలు ఒక్కో ప్రాంతంలో ఒక్కో ధరను ఫిక్స్ చేసి విక్రయాలు సాగిస్తున్నారు. నియోజకవర్గ కేంద్రాల్లో ఎమ్మార్పీకే విక్రయిస్తూ ఉండగా మండల కేంద్రాల్లోని దుకాణదారులు ఎమ్మార్పీ కంటే రూ.20 అధికంగా అమ్ముతున్నారు. మరోవైపు నందికొట్కూరు రూరల్ పరిధిలోని కొణిదెల గ్రామంలో రెండు వైన్ షాపులను ఏర్పాటు చేశారు. దీంతో ఈ గ్రామంలో ఒక షాప్‌లో ఎమ్మార్పీ కంటే రూ.10 తక్కువకు మద్యాన్ని విక్రయిస్తుండడం విశేషం.





రోడ్లపైనే మద్యం తాగుతున్న మందు బాబులు

దుకాణ ఆవరణలోనే..



ప్రైవేట్ మద్యం దుకాణాలు అక్టోబర్ 16 నుంచి తెరుచుకున్నాయి. పర్మిట్ రూమ్స్‌కు ప్రభుత్వం అధికారికంగా అనుమతులు ఇవ్వలేదు. దీంతో వైన్స్‌కు అనుబంధంగా ఏర్పాటు చేసిన వాటర్ బాటిళ్లు, స్టఫ్ రూంలలోనే అనధికారికంగా మందు తాపిస్తున్నారు. ఆయా రూములలో తాగినందుకు క్వార్టర్‌పై రూ.20 వసూలు చేస్తున్నారు. అయితే జిల్లాలో అధిక శాతం వైన్స్ షాపుల వద్ద అనుబంధంగా రూంలు ఏర్పాటు చేయలేదు. దీంతో మద్యం కొనుగోలు చేసిన వారిలో 90 శాతం మంది రోడ్డు మీదనే తాగేస్తున్నారు. దీంతో ఆయా రూట్లలో వెళ్లేందుకు చిన్నారులు, మహిళలు, కాలేజీ విద్యార్థినులు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారు. రోడ్ల మీద ఎక్కడ పడితే అక్కడ కూర్చొని మద్యం తాగుతున్నారు. తాగిన తర్వాత గాజు సీసాలు, వాటర్ బాటిళ్లు, వాటర్ ప్యాకెట్లను అలాగే వదిలేస్తున్నారు.

న్యూస్‌రీల్

యుద్ధప్రాతిపదికన గండిని పూడ్చేస్తాం

- ఎస్సార్‌బీసీ ఎస్ఈ వరప్రసాద్



గండిపడిన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న ఎస్ఈ

కోవెలకుంట్ల: కోవెలకుంట్ల సమీపంలో ఉన్న శ్రీశైలం కుడి గట్టు కాల్వ(ఎస్సార్‌బీసీ) 10వ బ్లాక్ కాల్వకు పడిన గండిని యుద్ధ ప్రాతిపదికన పూడ్చేందుకు చర్యలు చేపట్టినట్లు ఆ శాఖ ఎస్ఈ వరప్రసాద్ తెలిపారు. ఇటీవల కాల్వకు అధికంగా నీటిని విడుదల చేయడంతో బుధవారం కోవెలకుంట్ల–గుంజలపాడు ఆర్ అండ్‌బీ రహదారికి 200 మీటర్ల దూరంలో కాల్వకు గండి పడిన విషయం తెలిసిందే. ఈ మేరకు ఎస్సార్‌బీసీ ఎస్ఈ, డీఈ బాజీ, ఏఈలు సురేంద్రకుమార్, షేక్షావలి గురువారం గండి పడిన ప్రాంతాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్ఈ మాట్లాడుతూ మట్టి కట్ట, ఇసుక బస్తాలతో రెండు రోజుల్లో తాత్కాలిక పనులు చేపట్టి గండిని పూడుస్తామన్నారు. నీటి విడుదల ఆగిపోయాక గండి పడిన ప్రాంతాన్ని పటిష్టంగా ఏర్పాటు చేస్తామన్నారు. తాత్కాలిక పనులు కొనసాగే సమయంలో ఎగువ ప్రాంత రైతులకు సాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా చూస్తామన్నారు. 10వ బ్లాక్‌లోని 13.5 కి.మీ వద్ద అడ్డుకట్ట వేసి రైతులకు సాగునీటిని అందజేస్తామన్నారు.

వందశాతం ఉత్తీర్ణత సాధించాలి

- డీఈఓ సుధాకర్‌రెడ్డి

నందికొట్కూరు: పదో తరగతిలో వందశాతం ఉత్తీర్ణత సాధించాలని జిల్లా విద్యాశాఖ అధికారి సుధాకర్‌రెడ్డి ఎంఈఓలను ఆదేశించారు. గురువారం మండల పరిధిలోని బ్రాహ్మణకొట్కూరు ఎంపీపీ మెయిన్ స్కూల్, నందికొట్కూరులోని చైతన్య స్కూల్‌లో ఏర్పాటు చేసిన అపార్ నంబరు వర్క్‌షాపులను డీఈఓ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల ఆధార్ కార్డుల్లో ఎలాంటి తప్పులున్నా నవంబరులోపు సరి చేయాలన్నారు. వచ్చే నెల 14న మెగా పేరెంట్స్ మీటింగ్ ఏర్పాటు చేసి విద్యార్థుల ప్రతిభపై తల్లిదండ్రులతో చర్చించాలన్నారు. అనంతరం గతంలో బ్రాహ్మణకొట్కూరు మెయిన్ ఎంపీపీ స్కూల్‌లో శిలాఫలకం ధ్వంసం జరిగిన ఘటనపై డీఈఓ విచారణ చేశారు. ఆయన వెంట ఎంఈఓలు సుభాన్, ఫైజున్నీసాబేగం ఉన్నారు.

ఇన్‌చార్జ్ డీఈఓగా జనార్ధన్‌రెడ్డి



నంద్యాల(న్యూటౌన్): జిల్లా విద్యాశాఖ ఇన్‌చార్జ్ అధికారిగా జనార్ధన్‌రెడ్డిని నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఇక్కడ ఎఫ్ఏసీగా పూర్తి ఇన్‌చార్జ్ డీఈఓ బాధ్యతలు నిర్వహిస్తున్న సుధాకర్‌రెడ్డిని తన పాతస్థానం డోన్ డిప్యూటీ ఈఓగా పంపి, కర్నూలు డైట్ కళాశాల సీనియర్ లెక్చరర్ జనార్ధన్‌రెడ్డిని ఇన్‌చార్జ్ డీఈఓగా ప్రభుత్వం నియమించింది.

నంద్యాల డీఆర్‌ఓగా రామానాయక్

నంద్యాల(అర్బన్): నంద్యాల డీఆర్‌ఓగా రామానాయక్ బాధ్యతలు చేపట్టనున్నారు. కర్నూలు హెచ్ఎన్ఎస్ఎస్ యూనిట్–4లో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న రామానాయక్‌ను నంద్యాల డీఆర్‌ఓగా అధికారులు బదిలీ చేశారు. నంద్యాలలో విధులు నిర్వహిస్తున్న డీఆర్‌ఓ పద్మజను జీఏడీకి రిపోర్ట్ చేసుకోవాలని ఆదేశించారు. అదే విధంగా నంద్యాల ఆర్‌డీఓగా విశ్వనాథ్ బాధ్యతలు చేపట్టనున్నారు. కర్నూలు హెచ్ఎన్ఎస్ఎస్ యూనిట్–3లో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న ఆయనను నంద్యాల ఆర్‌డీఓగా బదిలీ చేశారు. ఇక్కడ విధులు నిర్వహిస్తున్న ఆర్‌డీఓ మల్లికార్జునరెడ్డిని జీఏడీకి రిపోర్ట్ చేసుకోవాలని ఆదేశించారు.

మహానందీశ్వరుడికి భూమి విరాళం



దస్తావేజులను ఈఓకు అందిస్తున్న దాతలు

మహానంది: మండల పరిధిలోని గోపవరం గ్రామానికి చెందిన రిటైర్డ్ లెక్చరర్ డి.రాజు, శకుంతల దంపతులు రెండెకరాల భూమిని విరాళమిచ్చారు. సర్వే నంబర్ 528లో ఉన్న రూ. 2 కోట్లకు పైగా విలువైన 2 ఎకరాల 10 సెంట్ల భూమితోపాటు గ్రామంలో ఉన్న 5 సెంట్ల ఇంటిని మహానందీశ్వర స్వామి దేవస్థానానికి రాసి ఇస్తూ ఈఓ నల్లకాలువ శ్రీనివాస రెడ్డికి గురువారం దస్తావేజులు అందించారు. దాత దంపతులను ఏఈఓ ఎరమల మధు, వేదపండితులు బ్రహ్మశ్రీ చెండూరి రవిశంకర్ అవధాని, ఆలయ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులు, తదితరులు సత్కరించి స్వామి అమ్మవారి ప్రసాదాలు అందించారు.

అలగనూరు రిజర్వాయర్ మరమ్మతులకు చర్యలు

- జిల్లా కలెక్టర్ రాజకుమారి



అలగనూరు రిజర్వాయర్‌ను పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ రాజకుమారి

మిడుతూరు: అలగనూరు రిజర్వాయర్ స్థితిగతులపై పూర్తి స్థాయి నివేదిక ఇస్తే దాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి మరమ్మతులకు చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ రాజకుమారి అన్నారు. మండలంలోని అలగనూరు బ్యాలెన్సింగ్ రిజర్వాయర్, రోళ్లపాడు అభయారణ్య ప్రాంతాన్ని కలెక్టర్ గురువారం పరిశీలించారు. అలగనూరు రిజర్వాయర్ వద్ద కుంగిన కట్టను పరిశీలించి, రిజర్వాయర్‌లోకి నీరు ఎలా వస్తుంది, సామర్థ్యం ఎంత, ఎన్ని ఎకరాల ఆయకట్టు ఉందనే వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. మూడేళ్లుగా కట్ట కుంగినా నిర్మాణం ఎందుకు చేపట్టలేదని కేసీ కెనాల్ ఈఈ ప్రతాప్‌ను ప్రశ్నించారు. రిజర్వాయర్‌ను డ్యాం సేఫ్టీ అధికారులు మూడు పర్యాయాలు పరిశీలించారని, రిజర్వాయర్ ప్రాంతంలో 245 మీటర్ల పొడవునా నూతన బండ్ నిర్మాణం చేపట్టాల్సి ఉందని, కట్ట కుంగిన ప్రాంతంలో మరమ్మతులు చేపట్టేందుకు రూ.34 కోట్లకు ప్రతిపాదనలు పంపినట్లు కలెక్టరుకు కేసీ కెనాల్ ఈఈ వివరించారు. డాం సేఫ్టీ అధికారుల నివేది కలతోపాటు, రిజర్వాయర్ స్థితిగతులపై, మరమ్మతులకు సంబంధించిన పూర్తి స్థాయి అంచనాలను నివేదిక రూపంలో అందజేయాలని కేసీ కెనాల్ ఈఈని ఆదేశించారు. అనంతరం రోళ్లపాడు అభయారణ్యం ప్రాంతాన్ని సందర్శించారు. కృష్ణజింకలు, వివిధ పక్షులను, గడ్డి మైదానాలను, బైనాక్యులర్‌తో వీక్షించారు. కార్యక్రమంలో అలగనూరు రిజర్వాయర్ డీఈ మోహన్‌రావు, తహసీల్దార్ శ్రీనివాసులు, డీఆర్వో తాహిర్, ఏఈబీఆర్ ఏఈలు మనోహర్, వీరమ్మ, కృష్ణప్రియ, నాగరాజు పాల్గొన్నారు.

పంటల బీమా ప్రీమియం చెల్లింపునకు చర్యలు తీసుకోండి

నంద్యాల: భారీ వర్షాల వల్ల రబీ సీజన్‌లో నష్టపోయిన పంటలకు ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన కింద నామమాత్రపు ప్రీమియం చెల్లింపునకు రైతులను ప్రోత్సహించాలని జిల్లా కలెక్టర్ రాజకుమారి వ్యవసాయ అధికారులను ఆదేశించారు. గురువారం అమరావతి వ్యవసాయ శాఖ డైరెక్టర్ కార్యాలయం నుంచి ముఖ్య కార్యదర్శి రాజశేఖర్ పంటల బీమా పథకం అమలు తీరుపై అన్ని జిల్లాల కలెక్టర్లు, వ్యవసాయ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. అనంతరం కలెక్టర్ జిల్లా అధికారులతో మాట్లాడుతూ డిసెంబర్ 15 నాటికి పంటల బీమా నమోదు ప్రక్రియను పూర్తి చేయాలన్నారు. ప్రీమియంపై రైతులకు అవగాహన కల్పించడంలో అశ్రద్ధ చేయొద్దన్నారు.

నేటి నుంచి పశుగణన

నంద్యాల(రూరల్): నేటి నుంచి అఖిల భారత పశుగణన కార్యక్రమం ప్రారంభం కానుందని పశుసంవర్ధకశాఖ జిల్లా అధికారి గోవింద్ నాయక్ తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ పశుగణన పక్కాగా నిర్వహించేందుకు కార్యాచరణ రూపొందించామన్నారు. అందులోభాగంగా ఇప్పటికే 275 మంది సిబ్బందికి శిక్షణ ఇచ్చామన్నారు. ఇందులో 192 మంది ఎన్యుమరేటర్లు, 83 మంది సూపర్‌వైజర్లు ఉన్నారన్నారు. వీరిపై వీఏఎస్‌లు, ఏడీలు, డీడీలు పర్యవేక్షణ ఉంటుందన్నారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న 4.29 లక్షల ఇళ్లకు వెళ్లి సమగ్ర వివరాలు సేకరిస్తారు. పాడి రైతులు కూడా పశుసంవర్ధకశాఖ సిబ్బందికి సహకరించాలన్నారు. పెంపుడు జంతువులు(కుక్కలు, గాడిదలు, గుర్రాలు తదితర జంతువులు) పెంచుకునే వారు కూడా వారి పెంపుడు జంతువుల వివరాలను తమ సిబ్బందికి తెలియజేయాలన్నారు. ఫిబ్రవరి 4వ తేదీలోపు పశుగణను పూర్తి చేసి, తుది జాబితాను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు అందజేస్తామన్నారు.

2019 పశుగణన ప్రకారం 31 లక్షల మూగజీవాలు

2019 పశుగణన ప్రకారం జిల్లా వ్యాప్తంగా(అప్పట్లో నంద్యాల డివిజన్) 29 మండలాల పరిధిలో అన్ని రకాల మూగజీవులు 30.24 లక్షలు ఉన్నాయి. అందులో పాడి ఆవులు, ఎద్దులు 2.59 లక్షలు, గేదెలు 3.60 లక్షలు, గొర్రెలు 13.49 లక్షలు, మేకలు 4.67 లక్షలు, పౌల్ట్రీ 5.39 లక్షలు, పందులు 11,674, కుక్కలు 38,326 ఉన్నట్లు వెల్లడైంది. ఆత్మకూరు, నందికొట్కూరు, డోన్ నియోజకవర్గాల్లో పాడి పశువులు, ఎద్దులు అధికంగా ఉన్నాయి.

బీఈడీ పరీక్ష కేంద్రాల పరిశీలన

కర్నూలు కల్చరల్: రాయలసీమ విశ్వవిద్యాలయం పరిధిలో జరుగుతున్న బీఈడీ మొదటి సెమిస్టర్ పరీక్ష కేంద్రాలను వర్సిటీ వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ ఎన్‌టీకే నాయక్ పరిశీలించారు. వర్సిటీ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్లుతో కలిసి వీసీ సిల్వర్ జూబ్లీ, సాయి కృష్ణ, శంకరాస్ డిగ్రీ కళాశాలల్లోని పరీక్ష కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 17 పరీక్ష కేంద్రాల్లో పరీక్షలు నిర్వహిస్తున్నామని వీసీ పేర్కొన్నారు. రెగ్యులర్, సప్లిమెంటరీకి సంబంధించి గురువారం మొత్తం 4,768 మంది విద్యార్థులకు గాను 4,359 మంది హాజరు కాగా 409 మంది గైర్హాజరయ్యారని తెలిపారు.

అభివృద్ధి పనులకు అడ్డుపడకండి

- రాష్ట్ర ఆర్థిక శాఖ మాజీ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి



గుండాల రిజర్వాయర్‌ను పరిశీలిస్తున్న మాజీ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి

డోన్: అభివృద్ధి పనులకు అడ్డు పడవద్దని రాష్ట్ర ఆర్థిక శాఖ మాజీ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి అధికార పార్టీ నాయకులకు విజ్ఞప్తి చేశారు. మండల పరిధిలోని ఎస్ గుండాల గ్రామంలో గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో రూ.3కోట్లతో నిర్మించిన టీటీడీ కళ్యాణ మండపం, భోజనశాల, మరో రూ.3కోట్లతో చేపట్టిన లక్ష్మీచెన్నకేశవ స్వామి ఆలయ జీర్ణోద్ధరణ పనులతోపాటు ఆర్డీటీ నిర్మించిన చెక్‌డ్యామ్‌ను గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి మాట్లాడుతూ ఎస్ గుండాల రిజర్వాయర్ నిర్మాణానికి ఆర్డీటీ రూ.50 లక్షలు ఖర్చు చేసిందన్నారు. దీనికి ముందస్తు డిపాజిట్ కోసం 10 శాతం డబ్బును గ్రామస్తులతో పాటు తాను చెల్లించిన విషయాన్ని ఆయన గుర్తు చేసుకున్నారు. ఈ మినీ రిజర్వాయర్ మూలంగా గుండాల, కోట్రాయి, చిన్నపూదెల్ల, కొత్తబురుజు, చనుగొండ్ల, పెద్దపూదెల్ల గ్రామాల్లో భూగర్భజలాలు వృద్ధి చెందే అవకాశం ఉందన్నారు. రూ.220 కోట్లతో హంద్రీనీవా కాల్వ నీటిని పైపులైన్ల ద్వారా ఈ ప్రాంతంలోని 66 చెరువులను నింపామన్నారు. చుక్క సాగునీటి అవకాశం లేని డోన్ పశ్చిమ ప్రాంతంలో 10 వేల ఎకరాలు సాగులోకి వచ్చే అవకాశం ఏర్పడిందన్నారు. తాగునీటి కష్టాలు తీర్చేందుకు గోరుకల్లు రిజర్వాయర్ నుంచి రూ.310 కోట్లతో పనులు చేపట్టి ప్రస్తుతం బేతంచెర్ల మండలానికి తాగునీరు అందించామన్నారు. ప్యాపిలి, డోన్ మండలాల్లో త్వరితగతిన శుద్ధ జలాన్ని అందించేందుకు ప్రస్తుత టీడీపీ పాలకులు వాటర్‌గ్రిడ్ పనులకు ఎలాంటి అవరోధాలు సృష్టించకుండా కృషి చేయాలని సూచించారు. శ్రీలక్ష్మీ చెన్నకేశవ స్వామి ఆలయ జీర్ణోద్ధరణ పనులను గత ప్రభుత్వం ప్రారంభించిన విషయాన్ని బుగ్గన గుర్తుచేశారు. గర్భగుడితోపాటు లక్ష్మీదేవి ఆలయం, ప్రహరీ పనులు ఇప్పటికే పూర్తయ్యాయని, గాలిగోపురం నిర్మాణానికి కొందరు ఆటంకం కలిగించడం తగదని అన్నారు. ఆలయ నిర్మాణం పూర్తయితే ఇక్కడి గ్రామాల ప్రజలు టీటీడీ కళ్యాణ మండపంలో శుభకార్యాలు నిర్వహించేకునేందుకు అవకాశం ఉంటుందన్నారు. అంతకుముందు ఆయన లక్ష్మీచెన్నకేశవ స్వామిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. ఆయన వెంట రాష్ట్ర మీట్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ శ్రీరాములు, ఎంపీపీ రేగటి రాజశేఖర్‌రెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు బద్దల రాజ్‌కుమార్, మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ మల్లెంపల్లె రామచంద్రుడు, పార్టీ సీనియర్ నాయకులు చిన్నపూజెర్ల రామచంద్రారెడ్డి, పెద్దపూజెర్ల కమతం భాస్కర్‌రెడ్డి, సింగిల్‌విండో మాజీ అధ్యక్షులు తిరునాంపల్లె తిరుమలరెడ్డి, సోమేష్ యాదవ్, పార్టీ జిల్లా బీసీ విభాగం అధ్యక్షులు పోస్టు ప్రసాద్ ఉన్నారు.



నిలిచిపోయిన గర్భగుడి ఆలయ పనులను పరిశీలిస్తున్న బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి

అప్పు చేసి పప్పు కూడు

- హాస్టళ్ల బిల్లులు చెల్లించని ప్రభుత్వం
- జిల్లా వ్యాప్తంగా రూ.7.5 కోట్లు బకాయిలు
- అవస్థలు పడుతున్న హాస్టల్ వార్డెన్లు
- విద్యార్థులకు తప్పని ఇక్కట్లు

కూటమి ప్రభుత్వం విద్యార్థుల నోటికాడి కూడు విషయంలోనూ కక్కుర్తి పడుతోంది. ఎస్సీ, బీసీ సంక్షేమ వసతి గృహాలకు బిల్లులు విడుదల చేయకుండా వార్డెన్లను సతాయిస్తోంది. దాదాపు రూ.7.5 కోట్లకు పైగా బిల్లులు చెల్లించకుండా మీనమేషాలు లెక్కిస్తుండడటంతో ఇంకెన్ని నెలలు అప్పు చేసి పప్పు కూడు పెట్టాలని వార్డెన్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. – నందికొట్కూరు

జిల్లాలోని 72 ఎస్సీ, బీసీ వసతి గృహాల్లో 8,678 మంది విద్యార్థులు ఉంటున్నారు. వారికి భోజనంతోపాటు హాస్టళ్ల నిర్వహణకు సంబంధించి ప్రభుత్వం నుంచి రూ.7,70,01,120 బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. 38 ఎస్సీ సంక్షేమ హాస్టళ్లలోని 4,486 మంది విద్యార్థులకు గాను నెలకు రూ.66,61,290 చొప్పున ఆరు నెలలకు రూ.3,99,67,740, 34 బీసీ వసతి గృహాల్లోని 4,192 మంది విద్యార్థులకు సంబంధించిన నెలకు రూ.47,81,245 గాను ఆరు నెలలకు కలిపి రూ.3,70,33,380 బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. బిల్లులు చెల్లించే దిశగా కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టడం లేదు. దీంతో వార్డెన్లు వసతి గృహాల నిర్వహణకు అప్పు చేయాల్సిన పరిస్థితి దాపురించింది. సుమారు ఆరు నెలల నుంచి బిల్లులు అందకపోవడంతో సంక్షేమాధికారులపై అప్పుల భారం పెరుగుతోంది. దీనికి తోడు కూరగాయల ధరలు విపరీతంగా పెరగడంతో భోజనం నాణ్యతపై తీవ్ర ప్రభావం చూపుతోంది. ఈ విషయమై తల్లిదండ్రులు సైతం ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. బిల్లులు మంజూరు చేయాలని వార్డెన్లు నెలల తరబడి వేడుకుంటున్నా కూటమి ప్రభుత్వం మాత్రం కనికరించడం లేదు.



బాలుర వసతి గృహం

మెనూ చార్జీలు ఇలా..

ప్రభుత్వం వసతి గృహాల నిర్వహణకు సంబంధించి ఒక్కో విద్యార్థికి రోజుకు రూ.48, కళాశాల హాస్టల్ విద్యార్థికి రూ.53 చొప్పున చెల్లించాల్సి ఉంది. ఈ లెక్కన సాధారణ వసతి గృహంలో ఒక్కో విద్యార్థికి నెలకు రూ.1,400, కళాశాల వసతి గృహం విద్యార్థికి రూ.1,600 చొప్పున చెల్లించాలి. వారానికి ఆరు కోడి గుడ్లు, ప్రతి ఆదివారం బిరియానీ, అరటిపండు, పాలు, కూరగాయలతో కూడిన ఆహారం అందించాలి. బిల్లుల చెల్లింపులో జాప్యంతో సరైన భోజనం అందించలేకపోతున్నామని వార్డెన్లు వాపోతున్నారు. విద్యుత్ దీపాలు, మరుగుదొడ్లు, మూత్రశాలల నిర్వహణ, కిటికీలు, తలుపుల మరమ్మతులకు కూడా వార్డెన్లు సొంత నగదు వెచ్చించాల్సి వస్తోంది.

హాస్టళ్లను నిర్వీర్యం చేసే కుట్ర



సకాలంలో బిల్లులు అందక వార్డెన్లు అప్పులు చేసి విద్యార్థులకు భోజనం ఏర్పాటు చేస్తున్నారు. 2014–2019 టీడీపీ హయాంలోనూ ఎస్సీ, బీసీ హాస్టళ్లను మూసివేసిన ఘనత చంద్రబాబుదే. మళ్లీ ఇప్పుడు ఎస్సీ, బీసీ హాస్టళ్లను నిర్వీర్యం చేసేందుకే ప్రభుత్వం బిల్లులు పెండింగ్ పెట్టినట్లు కనిపిస్తోంది.

– ఆది, పీడీఎస్‌యూ జిల్లా కార్యదర్శి

ఆందోళనలకు సిద్ధం



పేద విద్యార్థులు ఉంటున్న హాస్టళ్లకు తక్షణమే బిల్లులు విడుదల చేయాలి. లేనిపక్షంలో ఆందోళనలకు దిగుతాం. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి విద్యా వ్యవస్థను చిన్న చూపు చూస్తోంది. బిల్లులు మంజూరు చేయకపోవడంతో వార్డెన్లు విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందడం కష్టంగా ఉంది.

– దక్క కుమార్, విద్యార్థి సంఘం నాయకులు

బిల్లులు విడుదల చేస్తాం



ఆరు నెలల బిల్లులు ప్రభుత్వం విడుదల చేసేందుకు సిద్ధంగా ఉంది. పెండింగ్ బిల్లులు త్వరలోనే వార్డెన్ల బ్యాంకు ఖాతాలకు జమ చేస్తాం. మెనూ ప్రకారం భోజనం విద్యార్థులకు వడ్డిస్తున్నారు. మెనూ పాటించడం లేదని ఫిర్యాదులు వస్తే వార్డెన్లపై చట్ట పరమైన చర్యలు తీసుకుంటాం.

– చింతామణి, జిల్లా సోషల్ వెల్ఫేర్ ఆఫీసర్

క్లుప్తంగా

గుంతలో పడి 40 గొర్రెలు మృతి


మృతి చెందిన గొర్రెల వద్ద గొర్రెల కాపర్లు

డోన్ రూరల్: మండల పరిధిలోని ధర్మవరం గ్రామం వద్ద గురువారం ప్రమాదవశాత్తు మట్టి గుంతలో పడి 40 గొర్రెలు మృతి చెందినట్లు కాపర్లు కున్నూరు నాగరాజు, బోయ కిట్టన్న తెలిపారు. ఉదయం మేత మేపేందుకు గొర్రెల మందను తీసుకెళ్లగా గ్రామ సమీపంలోని ఓ గుంతలో గొర్రెలు ఒకదానిమీద ఒకటి పడి మృతి చెందాయని వాపోయారు. రూ.5 లక్షలు వరకు నష్టం జరిగిందని, అధికారులు స్పందించి ఆదుకోవాలని వేడుకున్నారు.

నూర్పిడి యంత్రంలో పడి వ్యక్తి దుర్మరణం


అలీఖాన్ (ఫైల్)

సంజామల: మండల పరిధిలోని ముదిగేడు గ్రామంలో మినుము నూర్పిడి యంత్రంలో పడి వ్యక్తి మృతి చెందిన సంఘటన గురువారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన చేవ విజయభాస్కర్ రెడ్డి అనే రైతు మూడెకరాల్లో మినుము పంట సాగుచేశారు. పంట కోత దశకు రావడంతో గురువారం నూర్పిడి యంత్రాన్ని పిలుచుకున్నారు. మినుము గింజలు పట్టించే పనిలో నిమగ్నమైన కూలీ, అదే గ్రామానికి చెందిన పసుపల అల్లీఖాన్ (54) ప్రమాదవశాత్తు మిషన్ మిషన్‌లో పడిపోవడంతో శరీరం ఛిద్రమై అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనాస్థలానికి చేరుకొని విచారణ చేపట్టారు. మృతుడికి భార్య హుస్సేని, ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు.

ఆటో, బైక్ ఢీకొని వ్యక్తి మృతి


మృతి చెందిన గైబుసా

దొర్నిపాడు: ఆటో, బైక్ ఢీకొన్న ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందగా మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. వివరాలు.. ఆళ్లగడ్డ మండలం ఓబులంపల్లి గ్రామానికి చెందిన గైబుసా(55), కృష్ణారెడ్డి అనే ఇద్దరు గురువారం బైక్‌పై కోవెలకుంట్ల నుంచి దొర్నిపాడు మీదుగా స్వగ్రామానికి బయలు దేరారు. అదే సమయంలో ఆళ్లగడ్డ నుంచి కోవెలకుంట్లవైపు ఆటో బయలుదేరింది. దొర్నిపాడులోని ఏడు గాండ్ల మోరీ వద్ద రెండు వాహనాలు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన గైబుసాను నంద్యాల ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా కోలుకోలేక మృతి చెందాడు. కృష్ణారెడ్డి గాయాలతో బయటపడ్డాడు. ప్రమాదంపై కేసు నమోదు చేసి విచారణ చేపట్టినట్లు ఎస్‌ఐ వెంకటేష్ తెలిపారు.

ఉరివేసుకొని యువకుడి బలవన్మరణం


మృతి చెందిన ఆంజనేయులు నాయక్

అవుకు: మండల పరిధిలోని ఇస్రా నాయక్ తాండాలో ఉరివేసుకొని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం .. గ్రామానికి చెందిన ఆంజనేయులు నాయక్ (32) గత కొన్నాళ్లుగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఈ స్థితిలో కుటుంబ సభ్యులతో మనస్పర్థలు ఏర్పడడంతో మనస్తాపానికి గురై గురువారం ఇంట్లో ఎవరూలేని సమయం చూసి కొక్కెనికి ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఘటనపై భార్య లలితాబాయి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ రాజారెడ్డి తెలిపారు. మృతుడికి కూతురు, కుమారుడు ఉన్నారు.

72 కి.మీ. 75 స్పీడ్‌బ్రేకర్లు

- ఆత్మకూరు – కర్నూలు మార్గంలో స్పీడ్‌బ్రేకర్లతో బేజారు
- నిత్యం 28 వేల మంది బస్సుల్లో ప్రయాణం
- ప్రయాణమంతా కుదుపులతో అవస్థలు
- వెన్నునొప్పులతో ఆస్పత్రిపాలు కావాల్సిందే

రహదారులపై ప్రమాదాలకు అతి వేగమే కారణం. అలాంటి వేగాన్ని నిరోధించడానికి ప్రధాన రహదారుల్లో స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేస్తుంటారు. ఇప్పుడు ఆ స్పీడు బ్రేకర్లే ప్రయాణికులకు ఇబ్బందిగా మారాయి. ఎక్కువ సంఖ్యలో ఉన్న స్పీడ్‌బ్రేకర్ల కారణంగా ప్రయాణం నరకప్రాయంగా మారడంతో పాటు ప్రయాణికులకు వెన్నునొప్పి సమస్యలు తెచ్చిపెడుతున్నాయి.


బన్నూరు గ్రామం వద్ద ఒకే చోట మూడు చొప్పున స్పీడు బ్రేకర్లు

పాములపాడు: ఆత్మకూరు నుంచి కర్నూలు పట్టణానికి 72 కిలోమీటర్ల దూరం ఉంది. ఈ మార్గంలో దాదాపు 75 స్పీడ్‌బ్రేకర్లను ఏర్పాటుచేశారు. వేగ నిరోధకాలైన ఈ స్పీడుబ్రేకర్లు ప్రయాణికులను కలవరపెడుతున్నాయి. దీంతో బస్సుల్లో ప్రయాణించాలంటేనే ప్రయాణికులు జంకుతున్నారు. స్పీడ్‌బ్రేకర్ల వల్ల ఏర్పడే కుదుపులతో వెన్నునొప్పుల బారిన పడుతున్నారు.

ప్రతి రోజు 35 సర్వీసులు

ఆత్మకూరు ఏపీఎస్ ఆర్టీసీ డిపో నుంచి 15 బస్సు సర్వీసులు, నందికొట్కూరు డిపో నుంచి 20 బస్సు సర్వీసులు ప్రతి రోజు కర్నూలుకు నడుస్తున్నాయి. అలాగే కర్నూలు డిపోతో పాటు డోన్, ఆదోని, కోడుమూరు, ఎమ్మిగనూరు, మంత్రాలయం డిపోల నుంచే గాకుండా పొరుగు రాష్ట్రమైన కర్ణాటక నుంచి ప్రతిరోజు 25కు పైగా బస్సు సర్వీసులు, అలాగే శ్రీశైలం, విజయవాడ, గుంటూరు, రాజమండ్రి, కాకినాడ, విశాఖపట్నం తదితర ప్రాంతాలకు బస్సు సర్వీసులు కొనసాగుతున్నాయి. ఆత్మకూరు నుంచి ఆర్డినరీ 26 సింగిల్స్, ఎక్స్‌ప్రెస్ 10 సింగిల్స్ చొప్పున ఆర్టీసీ బస్సులు రాకపోకలు సాగిస్తున్నాయి. నందికొట్కూరు నుంచి 14 సింగిల్స్ చొప్పున సర్వీసులు నడుస్తున్నాయి. ప్రతి రోజు సుమారు 28 వేలకు పైగా ప్రయాణికులు ప్రయాణాలు సాగిస్తున్నారు. ఆత్మకూరు నుంచి కర్నూలుకు ఆర్డినరీ 26 చోట్ల, ఎక్స్‌ప్రెస్ 10 చోట్ల స్టేజీలున్నాయి. ఈ స్టేజీల్లో బస్సులను తప్పనిసరిగా నిలపాల్సిందే. అలాగే ప్రయాణికులు చేయిఎత్తిన చోట బస్సులను నిలపాల్సిందే. ప్రస్తుతం నేషనల్ హైవే పనులు జరుగుతున్న నేపథ్యంలో స్పీడు బ్రేకర్లతో పాటు పలు చోట్ల మలుపుల వల్ల సమయానికి చేరుకోలేకపోతున్నామని ప్రయాణికులు వాపోతున్నారు.

ప్రయాణమంతా కుదుపులే!

72 కిలోమీటర్ల ప్రయాణంలో రోడ్డుపై గుంతలతో పాటు 75 స్పీడు బ్రేకర్లు ఉండటంతో బస్సులో కుదుపులు తప్పనిసరి. వెనక సీట్లలో కూర్చున్న వారి పరిస్థితి దయనీయం. ఈ కుదుపులకు కూర్చోలేక కొందరు నిలబడి ప్రయాణం చేయడం మేలని భావిస్తున్నారు. వృద్ధులు, అనారోగ్యం బారిన పడిన వారు, గర్భిణుల పరిస్థితి అగమ్యగోచరం. ప్రయాణికులతో పాటు బస్సు కండక్టర్లు, డ్రైవర్ల పరిస్థితి కూడా అంతే. ప్రయాణికులు ఒకసారి వెళ్లి రావడానికే ఇలాంటి పరిస్థితులు ఉంటే రోజు 26 సార్లు తిరిగే ఆర్టీసీ డ్రైవర్లు, కండక్టర్ల పరిస్థితి చెప్పనలవికానిది. కుదుపుల వల్ల చాలా మంది వెన్నునొప్పుల బారిన పడి ఆసుపత్రుల పాలవుతున్నారు. ఆర్థిక స్థోమత ఉన్న వారు కార్లలో ప్రయాణాలు చేస్తున్నారు. సామాన్యులకు మాత్రం ఆర్టీసీ బస్సే శరణ్యం. ఉన్నతాధికారులు ఈ విషయంలో సరైన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ప్రతి రోజు కర్నూలు నుంచి వందల సంఖ్యలో ప్రభుత్వ ఉద్యోగులు విధుల నిమిత్తం ఈ మార్గంలో ప్రయాణాలు సాగిస్తున్నారు. వారి బాధ ఎవరితో చెప్పుకోవాలో అర్థం కాని పరిస్థితి.

నెలకు ఒకసారి వెళ్లడానికే నరకం చూస్తున్నాం



నేను ప్రతి నెలా ఆసుపత్రి చికిత్స కోసం కర్నూలుకు వెళ్తాను. ఒక్కసారి వెళ్లిరావడానికే స్పీడు బ్రేకర్లతో అవస్థలు పడుతున్నాను. బస్సులో కూర్చుంటే ముందు సీట్లో కూర్చోవాలి, ఖాళీ లేకుంటే నిలబడి వెళ్లాల్సిందే. వెనక సీట్లో కూర్చుంటే ప్రస్తుతం ఉన్న రోగంతో పాటు మరో రోగం బారిన పడాల్సిందే. – **గఫూర్, పాములపాడు**

కర్నూలుకు పోకున్నా బాగుంటుంది



బస్సులో వెళ్లేదాని కంటే కర్నూలుకు పోకపోయినా బాగుంటుంది. అదెక్కడి స్పీడు బ్రేకర్లు దారి పొడవునా కుదుపులే. ఏదో ప్రమాదకరమైన చోటంటే సరే. కర్నూలకు పోయి వస్తే నొప్పుల మాత్రలు వేసుకోవాల్సిందే. బస్సులో బాలింతలు, గర్భిణులను చూస్తుంటే బాధగా ఉంటోంది. స్పీడు బ్రేకర్లను తగ్గిస్తే మంచిది. – **రమాదేవి, బానకచెర్ల**

కారు అద్దెకు తీసుకొని వెళ్తున్నాం



కర్నూలుకు వెళ్లాల్సి వస్తే కారు అద్దెకు తీసుకొని వెళ్తున్నాం. రోడ్డు వెంట స్పీడు బ్రేకర్లు అధికంగా ఉన్నాయి. పది రూపాయలు పోయినా బాధలేదని కారులో వెళ్లడానికే ఇష్టపడతాను. బస్సులో వెళ్లడం వల్ల సమయం వృథాతో పాటు డబ్బులిచ్చి ఒళ్లు నొప్పులు కొని తెచ్చుకున్నట్లే.

– **చంద్రశేఖర్, లింగాల**

ఫిర్యాదులొచ్చినా మాకెలాంటి అధికారం లేదు

స్పీడ్ బ్రేకర్ల విషయంపై ఫిర్యాదులొచ్చినా చర్యలు తీసుకోవడానికి మాకు ఎలాంటి అధికారం లేదు. నేషనల్ హైవే పనులు జరుగుతున్నందున తప్పదు. వాహనాల రద్దీ ఎక్కువగా ఉండడంతో ప్రమాదాలు ఏ రూపంలో జరుగుతాయో చెప్పలేము. ప్రస్తుతం ఉన్న స్పీడు బ్రేకర్లు తాత్కాలికమే. హైవే పనులు పూర్తవ్వగానే కొన్నింటిని తొలగిస్తాం.

– **మహేంద్రుడు, డీఎం ఏపీఎస్‌ఆర్టీసీ, ఆత్మకూరు**


కేజీ రోడ్డుపై నిర్మించిన స్పీడు బ్రేకర్

హత్యకేసులో ఇద్దరికి జీవిత ఖైదు


శిక్ష పడ్డ ముద్దాయిలు

ఆళ్లగడ్డ: భార్యభర్తల కుటుంబ తగాదాలో బంధువుల జోక్యంతో సొంత అల్లుడి హత్యకు దారితీసింది. కేసు విచారణ చేపట్టిన ఐదవ అదనపు జిల్లా కోర్టు నిందితులు ఉశేన్‌వలి, ఉశేన్‌బీలకు యావజ్జీవ శిక్ష విధిస్తూ గురువారం తీర్పు వెల్లడించింది. కేసు పూర్వపరాలు ఇలా.. శిరివెళ్ల మండలం కోటపాడు గ్రామానికి చెందిన ఉశేన్‌బీ కూతురు మొహతాబీని ఆళ్లగడ్డకు చెందిన అహమ్మద్ హుస్సేన్‌కు ఇచ్చి వివాహం జరిపించారు. కొంతకాలం సంసారం సాఫీగా సాగింది. అనంతరం దంపతులు తరుచూ గొడవ పడేవారు. ఈ క్రమంలో మొహతాబీ కోటపాడులో ఉండే తల్లి ఉశేన్‌బీ వద్దకు చేరుకుని అక్కడే ఉంటోంది. భార్యను కాపురానికి తీసుకెళ్లేందుకు భర్త అహమ్మద్ హుస్సేన్ ప్రయత్నాలు చేసినా ఆమె వెళ్లేందుకు ఇష్టపడలేదు. ఈ క్రమంలో 2019 మార్చి 9న అహమ్మద్ హుస్సేన్ అత్తారింటికి వెళ్లి భార్యను కాపురానికి రావాలని కోరడంతో ఘర్షణ ఏర్పడింది. కూతురు, అల్లుడు గొడవపడటం చూసిన ఉశేన్‌బీ ఇంటిపక్కనున్న బంధువు ఉశేన్‌వలిని పిలుచుకొచ్చింది. అతడు సర్దిచెప్పేందుకు ప్రయత్నించగా మాటామాట పెరిగి మహమ్మద్ హుస్సేన్‌తో గొడవకు దారితీసింది. సహనం కోల్పోయిన ఉశేన్‌వలి ఆవేశంతో మంచంపై కూర్చొన్న మహమ్మద్‌హుస్సేన్‌పై పెట్రోల్ పోసి నిప్పటించాడు. తీవ్రంగా గాయపడిన అతన్ని కర్నూలు వైద్యశాలకు తరలించగా కోలుకోలేక మృతి చెందాడు. ఈ ఘటనపై శిరివెళ్ల పోలీసులు నిందితులు ఉశేన్‌వలి, అతనికి సహకరించిన ఉశేన్‌బీపై హత్య కేసు నమోదు చేశారు. ఈ కేసు గురువారం తుది విచారణకు రాగా నేరం రుజువు కావడంతో యావజ్జీవ శిక్షతో పాటు ఒక్కొక్కరికి రూ.1000 జరిమానా విధిస్తూ ఆళ్లగడ్డ ఐదవ అదనపు జిల్లా కోర్టు న్యాయమూర్తి ఆర్‌వీవీఎస్.మురళీకృష్ణ తీర్పు వెలువరించారు.

బొలేరో అదుపుతప్పి ఇద్దరి మృత్యువాత


బొలేరో క్యాబిన్‌లో ఇరుక్కుపోయిన మృతదేహం

కోడుమూరు రూరల్: కోడుమూరు నుంచి కర్నూలు మార్గంలో పందుల లోడుతో వెళుతున్న బొలేరో కొత్తూరు దాటిన తర్వాత అదుపుతప్పి చెట్టును ఢీకొట్టడంతో ఇద్దరు వ్యక్తులు మృత్యువాత పడ్డారు. ఈ ప్రమాదంలో కడప జిల్లా చెన్నూరుకు చెందిన రామయ్య (43), నంద్యాల జిల్లా ఆళ్లగడ్డకు చెందిన గుర్రప్ప (32) బొలేరోలో మృతిచెందారు. వాహనం నడుపుతున్న వెంకటయ్యకు తీవ్రగాయాలవ్వడంతో చికిత్స నిమిత్తం కర్నూలు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. వీరంతా గురువారం ఎమ్మిగనూరులో పందులను కొనుగోలు చేసుకుని తరలిస్తుండగా ఈ ప్రమాదం చోటు చేసుకుంది. విషయం తెలుసుకున్న కె.నాగలాపురం పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వాహనం క్యాబిన్‌లో ఇరుక్కుపోయిన మృతదేహాలను బయటకు తీసి పోస్టుమార్టం నిమిత్తం కర్నూలు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అతివేగం వల్లే ప్రమాదం జరిగినట్లు పోలీసులు నిర్ధారించారు.

కబళించిన మృత్యువు


సిద్ధ (ఫైల్)

ఆదోని అర్బన్: సంతోషంగా ఉన్న కుటుంబంపై విధి కన్నెర్ర చేసింది. రోడ్డు ప్రమాదం రూపంలో యువకుడిని మృత్యువు కబళించడంతో ఆ కుటుంబం ఒక్కసారిగా శోకసంద్రంలో మునిగింది. వివరాలు.. కౌతాళం మండలం అగసలదిన్నె గ్రామానికి చెందిన శ్రీనివాసులు, మాలింగమ్మ దంపతుల కుమారుడు సిద్ధ (24)కు ఆరేళ్ల క్రితం లక్ష్మి అనే యువతితో వివాహం జరిగింది. ఐదేళ్ల నిరీక్షణ తర్వాత ఇటీవల భార్య లక్ష్మి గర్భం దాల్చింది. ఐదు నెలలు నిండటంతో సీమంతం జరిపించి ప్రసవం కోసం తల్లిదండ్రులు కర్ణాటక రాష్ట్రం సిరుగుప్ప తాలూకా రారావి గ్రామానికి తీసుకెళ్లారు. ఈ స్థితిలో సంతోషంగా ఉన్న సిద్ధను రోడ్డు ప్రమాదం రూపంలో మృత్యువు కబళించింది. గురువారం మధ్యాహ్నం బాపురం గ్రామంలో బంధువుల పత్తి దిగుబడులు విడిపించేందుకు సిద్ధ తన స్నేహితుడైన గంగాధర్‌తో కలిసి వెళ్లాడు. సాయంత్రం స్వగ్రామానికి తిరుగుపయనమయ్యారు. అదే సమయంలో కర్ణాటక రాష్ట్రం కొప్పల జిల్లా కాటికి తాలూకా సిద్ధాపురం గ్రామానికి చెందిన సత్యనారాయణ, వెంకటేశ్వర్లు బైక్‌పై మంత్రాలయం వస్తున్నారు. అగసలదిన్నె గ్రామ సమీపంలో రెండు బైకులు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ప్రమాదంలో సిద్ధ, మరో బైక్‌పై వచ్చిన సత్యనారాయణకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు సిద్ధ బంధువులకు తెలుపగా వారు వచ్చి ఇరువురిని ఆదోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కోలుకోలేక సిద్ధ మరణించాడు. గర్భిణిగా ఉన్న భార్య లక్ష్మి భర్త మృతి విషయం తెలుసుకుని కన్నీటి పర్యంతమయ్యింది. ఇప్పుడిప్పుడే సంతోషం నెలకొంటున్న ఇంట్లో యువకుడు మృతి చెందడంతో తల్లిదండ్రులు రోదిస్తున్న తీరు అందరి హృదయాలను కలిచివేసింది.

వీఆర్వో చెన్నయ్య సస్పెన్షన్

కొలిమిగుండ్ల: కనకాద్రిపల్లె వీఆర్వో చెన్నయ్యను జిల్లా కలెక్టర్ రాజకుమారి సస్పెండ్ చేసినట్లు తహసీల్దార్ బాల ఈశ్వరరెడ్డి గురువారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాలు.. ఇటిక్యాల గ్రామ సమీపం 738, 765 సర్వే నంబర్లలోని ప్రభుత్వ భూమిలో 25 మందికి ఇళ్ల పట్టాల కోసం రెవెన్యూ అధికారుల ప్రమేయం లేకుండా ఎన్‌ఓసీ పత్రాలను వీఆర్వో జారీ చేశారు. వాటి ఆధారంగా రిజిస్ట్రేషన్లు కూడా జరిగాయి. వీటిపై వివిధ పత్రికల్లో కథనాలు ప్రచురితం కావడంతో ఆగస్టు 17న నంద్యాల ఆర్డీఓ ప్రభుత్వ భూమిని పరిశీలించారు. 25 మందికి నిరంభ్యంతర ధ్రువీకరణ పత్రాలు జారీ చేసినట్లు విచారణలో తేలడంతో నివేదికను కలెక్టర్‌కు అందజేశారు. దీంతో ప్రభుత్వ ఆస్తికి నష్టం కలిగించేలా వ్యవహరించిన వీఆర్వోపై సస్పెన్షన్ వేటు పడింది. కలెక్టర్ నుంచి వచ్చిన సస్పెన్షన్ ఉత్తర్వులను వీఆర్వోకు అందజేసినట్లు తహసీల్దార్ వెల్లడించారు.

పెళ్లి షాపింగ్ చేసి వస్తూ..

పెద్దకడబూరు: ఆటో అదుపుతప్పి బోల్తా పడిన ప్రమాదంలో వ్యక్తి మృతి చెందాడు. ఘటనపై ఏఎస్‌ఐ శివరాములు తెలిపిన వివరాల మేరకు.. మంత్రాలయంకు చెందిన మదినాబీ కుమారుడి పెళ్లి కోసం బుధవారం ఆటోలో ఆదోనికి వెళ్లి షాపింగ్ చేశారు. రాత్రి తిరుగు ప్రయాణం అయ్యారు. ఆదోని- మాధవరం రహదారిలో హోంనగర్ సమీపంలో ఎదురుగా వచ్చిన ఆటోను తప్పించేక్రమంలో వీరి ఆటో బోల్తా పడింది. ఆటోలో ప్రయాణిస్తున్న మదినాబీ కుటుంబసభ్యులు ముల్లా ఖాజాహుసేన్, కాజా, బందెనవాజ్, రషీదాకు గాయాలయ్యాయి. స్థానికులు వారికి పెద్దతుంబళం ఆస్పత్రిలో చికిత్స చేయించి మెరుగైన వైద్యం కోసం ఆదోని ఆస్పత్రికి తరలించారు. ముల్లా ఖాజాహుసేన్ (54) పరిస్థితి విషమంగా ఉండడంతో కర్నూలుకు తరలించగా కోలుకోలేక గురువారం ఉదయం మృతిచెందాడు. మదీనాబీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని విచారణ చేస్తున్నట్లు ఏఎస్‌ఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

డోన్ రూరల్: మండల పరిధిలోని వెంకటాపురం వద్ద గురువారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో గుమ్మకొండ గ్రామానికి చెందిన కొత్త్లో సురేష్ (31) మృతి చెందినట్లు స్థానికులు తెలిపారు. తన సొంత పని మీద డోన్ పట్టణానికి బైక్‌పై వెళ్లి తిరిగి గుమ్మకొండ గ్రామానికి వస్తుండగా వెంకటాపురం వద్ద రోడ్డుపై కుందేలు అకస్మాత్తుగా అడ్డు రావడంతో అదుపు తప్పి కింద పడ్డాడు. తీవ్రంగా గాయపడిన సురేష్‌ను వెంటనే డోన్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు డాక్టర్లు నిర్ధారించారు. మృతుడికి భార్య, కుమారుడు ఉన్నారు.

విత్తన కంపెనీకి మొట్టికాయ

- బాధిత రైతుకు రూ.3 లక్షలు పరిహారం చెల్లించాలని కమిషన్ ఆదేశం

కర్నూలు (లీగల్): నాణ్యత లేని క్యాబేజీ విత్తనాలను విక్రయించిన ఉత్పత్తిదారు అక్షయ సీడ్స్ (మహారాష్ట్ర)కు జిల్లా వినియోగదారుల వివాదాల పరిష్కార కమిషన్ మొట్టికాయ వేసింది. కంపెనీలు నాణ్యత లేని విత్తనాలను విక్రయించడం అనైతిక వాణిజ్యం కిందకే వస్తుందని స్పష్టం చేసింది. కంపెనీ హామీ ఇచ్చిన మేరకు దిగుబడి రాక నష్టపోయిన రైతుకు రూ.3 లక్షలు పరిహారం చెల్లించాలని ఆదేశించింది. ఈ మేరకు కమిషన్ ప్రెసిడెంట్ కరణం కిషోర్‌కుమార్, సభ్యులు ఎస్.నారాయణరెడ్డి, నజీమా కౌసర్ ఉత్తర్వులు జారీ చేశారు. వివరాల్లోకి వెళ్తే.. కల్లూరు మండలం తడకనపల్లెకు చెందిన రైతు జి.రమేష్ కర్నూలు నగరానికి చెందిన మహాలక్ష్మి సీడ్స్ దుకాణంలో అక్షయ సీడ్స్ దివ్య క్యాబేజీ రకం విత్తనాలను మార్చి 2019లో కొనుగోలు చేసి పంట సాగు చేశాడు. విక్రేత తెలిపిన మేరకు దిగుబడి రాకపోవడంతో రైతు వ్యవసాయ అధికారులకు ఫిర్యాదు చేశాడు. పంటను పరిశీలించిన వ్యవసాయ అధికారులు విత్తనాలు నాణ్యతగా లేకపోవడం వద్ద దిగుబడి తగ్గిందని నిర్ధారించారు. రైతుకు జరిగిన నష్టాన్ని విత్తన విక్రయ కంపెనీ భరించాలని నివేదికలో పేర్కొన్నారు. దీన్ని పరిశీలించిన కమిషన్ బాధిత రైతుకు రూ.3 లక్షల నష్టపరిహారం చెల్లించాలని విత్తన కంపెనీని ఆదేశిస్తూ తీర్పు వెల్లడించింది.

బాలుడిపై వీధికుక్కల దాడి



తోదేండ్లపల్లెలో కుక్కల దాడిలో గాయపడిన ప్రభుదేవా

చాగలమర్రి: మేజర్ గ్రామ పంచాయతీ చాగలమర్రితో పాటు మండలంలోని గ్రామాలలో వీధి కుక్కల స్వైర విహారంతో ప్రజలు బెంబేలెత్తుతున్నారు. గురువారం తోడేండ్లపల్లె గ్రామంలో 4వ తరగతి విద్యార్థి ప్రభుదేవా ఇంటి నుంచి పాఠశాలకు వెళ్తుండగా రోడ్డుపై ఉన్న 5 వీధికుక్కలు ఒకేసారి దాడికి ఎగబడ్డాయి. విద్యార్థి పరుగులు తీయగా వెంటబడి అందినకాడల్లా కరిచాయి. కుక్కల దాడిలో ప్రభుదేవాకు శరీరం, కుడి కాలి తొడపై రక్తగాయాలయ్యాయి. గ్రామస్తులు కుక్కలను తరిమికొట్టి బాలుడిని కాపాడారు. అలాగే పది రోజుల క్రితం మరో విద్యార్థిపై కుక్కలు దాడి చేయడంతో తీవ్రంగా గాయపడినట్లు గ్రామస్తులు తెలిపారు. దీంతో ఒంటరిగా బయటకు వెళ్లాలన్నా, చిన్నపిల్లలను బడికి పంపాలన్నా గ్రామస్తులు భయాందోళన చెందుతున్నారు. పంచాయతీ అధికారులు చర్యలు చేపట్టి వీధి కుక్కల బెడద నుంచి రక్షణ కల్పించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

కొడుకు జులాయిగా తిరుగుతున్నాడని తల్లి ఆత్మహత్య

కర్నూలు (టౌన్): కొడుకు జులాయిగా తిరుగుతున్నాడు. ఎన్నిసార్లు చెప్పినా మారకపోవడంతో ఓ తల్లి ఉరేసుకొని ఆత్మహత్య చేసుకుంది. నాలుగవ పట్టణ పోలీసు స్టేషన్ పరిధిలోని గుత్తి పెట్రోల్ బంకు సమీపంలో ఆర్టీసీ మెకానిక్ వెంకటేష్ కుటుంబం నివసిస్తోంది. ఆయనకు భార్య ప్రమీలమ్మ (53), కుమారుడు, కుమార్తె ఉన్నారు. కొడుకు రవితేజ జులాయిగా తిరుగుతూ మాట వినడం లేదని విరక్తి చెందిన తల్లి బుధవారం రాత్రి ఇంట్లో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకుంది. ఘటనపై కుటుంబ సభ్యుల సమాచారం మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని విచారణ చేస్తున్నారు.

ఇంట్లో కింద పడి మహిళ మృతి

కొడుకును చూసేందుకు వెళ్లిన ఓ తల్లి ప్రమాదవశాత్తు కింద పడి కోలుకోలేక మృతి చెందింది. ఒకటవ పట్టణ పోలీసు స్టేషన్ పరిధిలోని రంగరాజు వీధికి చెందిన హుస్సేన్ బీ (56) కుమారుడిని చూసేందుకు ఈ నెల 22న వీకర్ సెక్షన్ కాలనీకి వెళ్లింది. అక్కడ ఇంట్లో జారి పడడంతో గాయాలయ్యాయి. వెంటనే కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ కోలుకోలేక గురువారం మృతి చెందినట్లు పోలీసులు వెల్లడించారు.

మూడు రోజుల తర్వాత మృతదేహం లభ్యం


డోన్ రూరల్: మండల పరిధిలోని మల్లెంపల్లి గ్రామానికి చెందిన మాదన్న (50) మృతదేహం మూడు రోజుల తర్వాత లభ్యమైంది. ఘటనపై రూరల్ పోలీలసులు తెలిపిన వివరాలు.. మాదన్న మూడు రోజుల క్రితం ఇంటి నుంచి వెంకటాపురం గ్రామానికి సొంత పని మీద వెళ్లాడు. తిరిగి వస్తుండగా గ్రామ సమీపంలో బైక్ అదుపుతప్పి రోడ్డు పక్కనున్న కంపచెట్లలో పడిపోయాడు. అతడు ఇంటికి రాకపోవడంతో కుటుంబసభ్యులు పలుచోట్ల విచారించినా ఆచూకీ తెలియలేదు. ఈ క్రమంలో గురువారం పొలం పనులకు అటుగా వెళ్లిన గ్రామస్తులు దుర్వాసన వస్తుండడంతో దగ్గరకు వెళ్లి చూడగా మృతదేహం కనిపించింది. వెంటనే బాధిత కుటుంబసభ్యులకు సమాచారం అందించారు. మృతుడు వెల్డర్‌గా పనిచేసేవాడు, భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. కేసు నమోదు చేసినట్లు రూరల్ పోలీసులు తెలిపారు.

ఉల్లి రైతు దిగాలు


యార్డు వెలుపల బారులుదీరిన వాహనాలు


యార్డు నిండా ఉల్లి సంచులే

కర్నూలు వ్యవసాయ మార్కెట్ యార్డుకు ఉల్లి తాకిడి తగ్గడం లేదు. గురువారం కూడా మార్కెట్‌కు భారీగా ఉల్లి వచ్చింది. మార్కెట్ అన్ని వైపుల ఈ పంట దిగుబడులే కనిపిస్తున్నాయి. ఆన్‌లైన్ టెండరు ప్రక్రియలో సాంకేతిక సమస్యలు ఏర్పడటంతో కొనుగోలులో తీవ్ర జాప్యం జరుగుతోంది. దీనికితోడు కాటా వేయడంలోనూ ఆలస్యమవుతుండటతో రైతన్నలు ఆందోళన చెందుతున్నారు. తమ సరుకును ఎప్పుడు కొనుగోలు చేస్తారోనని ఎదురుచూస్తున్నారు. రెండు మూడు రోజులుగా మార్కెట్‌లో ఇదే పరిస్థితి నెలకొంది. – సాక్షి, ఫొటోగ్రాఫర్, కర్నూలు


ఉల్లి గ్రేడింగ్ చేస్తున్న కూలీలు


సంచులపైనే సేద తీరుతున్న రైతులు